## క్లుప్తంగా

### మేడారానికి ప్రత్యేక బస్సులు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి మేడారానికి ఆదివారం నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ బి.రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మేడారం వెళ్లే భక్తుల సౌకర్యార్థం భద్రాచలం నుంచి ప్రతి 15 నిమిషాలకు ఓ బస్సు బయలుదేతుందని పేర్కొన్నారు. భద్రాచలం నుంచి మేడారం వెళ్లడానికి పెద్దలకు రూ.300, పిల్లలకు రూ.160గా టికెట్ ఉన్నట్లు తెలిపారు. ఈ అవకాశాలన్ని భద్రాచలం డిపో పరిధిలోని భక్తులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

### విద్యార్థులకు వితరణ

చర్లరూరల్: చర్లలోని వనవాసీ కల్యాన పరిషత్తులోని విద్యార్థులకు శుక్రవారం రూ.25 వేల విలువ చేసే దుస్తులు, బ్యాగులు, బియ్యాన్ని అందించారు. మండల మాజీ విద్యాశాఖ అధికారి దివంగత కేవీ నరసింహారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కె.శివరామకృష్ణ సామగ్రిని తహసీల్దార్ భరణిబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయులుగా, మండల విద్యాశాఖ అధికారిగా నరసింహారావు ఏజెన్సీ ప్రాంతంలోని విద్యార్థులకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు దొడ్డి తాతారావు, మీకోసం మేమున్నాం సహాయ సమితీ చైర్మన్ నీలి ప్రకాష్, దొడ్డా ప్రభుదాస్, మల్లాది సుబ్రహ్మణ్యం,పెద్దాడ ఆశాలత,కోరం సూర్యనారాయణ,తాటి పాపారావు, గోగికార్ రామలక్ష్మణ్, బందా స్వరూప, గొంది శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### కాంప్లెక్స్ హెచ్ఎంలకు వినతి

దమ్మపేట: మండలంలోని కాంప్లెక్స్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, ప్రధానోపాధ్యాయులకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం మండల పరిధిలోని దమ్మపేట, పట్వారిగూడెం, మల్కారం, గండుగులపల్లి, ముష్టిబండ, నాచారం కాంప్లెక్స్‌ల ప్రధానోపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంప్లెక్స్ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సర్వీస్ రిజిష్టర్లను ఎప్పటికప్పుడూ నవీకరించి, ఏకోపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయాలని, ఖాళీగా ఉన్నచోట్ల విద్యావలంటీర్ల నియమాకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో దమ్మపేట హెచ్ఎం ఉషరాణి, యూటీఎఫ్ నాయకులు రమేష్ కుమార్, ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### ఏజెన్సీపై దృష్టి సారించాలి

బూర్గంపాడు: భద్రాచలం ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్‌ను సీనియర్ కాంగ్రెస్ నాయకుడు యడమకంటి రోశిరెడ్డి కోరారు. శుక్రవారం రాజస్థాన్‌కు చెందిన ఎమ్మెల్యే రాజేంద్ర జైన్‌తో పాటుగా రోశిరెడ్డి గిరిజన సంక్షేమ కార్యదర్శిని కలిశారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంత సమస్యలను వివరించి, అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని కోరారు. భద్రాచల సీతారామచంద్రస్వామి శేషవస్త్రాలను, లడ్డు ప్రసాదాలను ఆయనకు అందజేశారు.

### గన్నవరం కాలనీలో వైద్య శిబిరం

చర్లరూరల్: మండలంలోని గన్నవరం కాలనీలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులకు జ్వరాలు అధికంగా వస్తున్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలని, సెప్టిక్ ట్యాంకు పైపులకు క్లాత్‌లు కట్టుకోవలని అన్నారు. జ్వరాలు వచ్చిన వెంటనే కొయ్యూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి రావాలని సూచించారు.ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రామలక్ష్మి,హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ గోపి, సమ్మక్క, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

**హోమియోపతి వైద్య శిబిరం**

సీజనల్ వ్యాధులు, జ్వరాలు రాకుండా ముందు జాగ్రత్తగా గన్నవరం కాలనీలో శుక్రవారం హోమియోపతి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ పూజ రోగులకు అవసరమయ్యే మందులు అందించారు.

### అయోధ్య ప్రసాదం పంపిణీ

ములకలపల్లి: ములకలపల్లిలో అయోధ్య బాలరాముడి మహాలయ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) మండల కార్యదర్శి గొడ్ల రాజు, ఉపాధ్యక్షుడు పువ్వాల శ్రీనివాస్, ప్రముఖ వ్యాపారి పద్దం బుజ్జి ఇటీవల అయోధ్య క్షేత్రతీర్థాన్ని దర్శించుకుని వచ్చారు. శుక్రవారం వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు డాక్టర్ కారంపూడి సత్యనారాయణరాజు, శ్రీభక్త అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు శనగపాటి రవితో కలసి అయోధ్య దివ్యప్రసాదాన్ని పలువురికి అందజేశారు.

# బంద్ విజయవంతం


ములకలపల్లి: ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట నినాదాలు


దమ్మపేట: మండలపల్లి రాష్ట్రీయ రహదారిపై..

కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన దేశవ్యాప్త గ్రామీణ బంద్ విజయవంతమైంది. నియోజకవర్గాల్లోని దాదాపుగా అన్ని ప్రాంతాల్లో వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థలు, బ్యాంకులు తెరుచుకోలేదు. పార్టీల నాయకులు, కార్యకర్తలు బైక్, ఆటో ర్యాలీలతో నిరసన తెలిపారు. కూడళ్ల మీదుగా రోడ్లపై ర్యాలీగా బ్యానర్లతో నడిచారు. రహదారులపై ధర్నాలు చేపట్టి వాహనాల రాకపోకలు నిలిపివేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసనగా నినాదాలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న అఖిలపక్షం నాయకులు


అశ్వారావుపేటరూరల్: కార్మికుల ప్రదర్శన..


చంద్రుగొండ: మూతబడిన దుకాణాలు


భద్రాచలంలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ..


మణుగూరుటౌన్: బీటీపీఎస్‌లో ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు


మణుగూరుటౌన్: సింగరేణి మెయిన్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు, సింగరేణి అధికారుల పర్యవేక్షణ


చంద్రుగొండ: జాతీయ రహదారిపై ప్రదర్శన చేస్తున్న వివిధ పార్టీల నాయకులు


దుమ్ముగూడెం: ములకపాడు సెంటర్‌లో ఆటో డ్రైవర్ల ధర్నా..


పినపాక: బయ్యారం క్రాస్ రోడ్ వద్ద ర్యాలీ..


అన్నపురెడ్డిపల్లి: నిరసన తెలుపుతున్న అఖిలపక్షం నాయకులు


బూర్గంపాడు: ప్రధానకూడలిలో ఆందోళన చేస్తున్న వామపక్ష నాయకులు


మణుగూరురూరల్: గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు


మణుగూరుటౌన్: సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రదర్శన..


కరకగూడెం: నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, నాయకులు



దుమ్ముగూడెం: లక్ష్మీనగరం బ్యాంక్ వద్ద ధర్నాలో పాల్గొన్న అఖిలపక్షం నాయకులు


అశ్వాపురం: మొండికుంటలో రాస్తారోకో చేపడుతున్న నాయకులు


చర్ల: ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘం నాయకులు


కరకగూడెం: కరకగూడెం: రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

# డీఎస్పీగా బాధ్యతలు స్వీకరణ


డీఎస్పీ రవీందర్‌రెడ్డి


సీఐ సతీష్‌కుమార్


ఎస్సై శ్రీనివాస్

మణుగూరురూరల్: మణుగూరు సబ్ డివిజన్ అధికారిగా వంగ రవీందర్‌రెడ్డి శుక్రవారం కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన డీఎస్పీ ఎస్వీ రాఘవేంద్రరావు హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మెట్‌పల్లి ఎస్‌డీపీఓగా విధులు నిర్వహిస్తున్న రవీందర్‌రెడ్డిని మణుగూరుకు బదిలీపై వచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణుగూరు సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం డీఎస్పీ రవీందర్‌రెడ్డిని పోలీస్ అధికారులు, పట్టణ ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**సీఐగా సతీష్‌కుమార్..**

మణుగూరు సీఐగా ఎస్.సతీష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న రమాకాంత్ మల్టీజోన్-1కు బదిలీ కాగా... ఆయన స్థానంలో భద్రాద్రి కొత్తగూడెం సీసీఎస్-1లో విధులు నిర్వహిస్తున్న సీఐ సతీష్‌కుమార్ బదిలీపై మణుగూరు వచ్చారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన సీఐ సతీష్‌కుమార్‌కు పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

**భద్రాచలం ఎస్సైగా శ్రీనివాస్..**

భద్రాచలంఅర్బన్: భద్రాచలం టౌన్ ఎస్సైగా శుక్రవారం శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భద్రాచలం ట్రాఫిక్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్, భద్రాచలం టౌన్ ఎస్సైగా బదిలీ అయ్యారు. టౌన్ ఎస్సైగా శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# విద్యుత్ లైన్ ప్రారంభం

భద్రాచలంటౌన్: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం ప్రాంగణంలోని తానీషా కల్యాణ మండపం వద్ద గల వసతి గృహాల సముదాయానికి నూతన విద్యుత్ లైన్‌ను ఈఓ రమాదేవి శుక్రవారం ప్రారంభించారు. విద్యుత్ వోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు ఆలయ అధికారులు సుమారు రూ.10 లక్షల వ్యయంతో 100 కేవీ విద్యుత్ లైన్‌తో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయగా ఈఓ ప్రత్యేక పూజలు చేసి స్విచ్ ఆన్ చేశారు. ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పూజలు చేస్తున్న ఈఓ రమాదేవి

# కోర్టులో హాజరుపరచాలి



బూర్గంపాడు: ఆందోళన చేస్తున్న ఎన్డీ నాయకులు

బూర్గంపాడు: పోలీసులు అదుపులోకి తీసుకున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్, రాష్ట్ర నాయకులు గోపన్నతో పాటుగా మరో ఇద్దరిని వెంటనే కోర్టులో హాజరు పరచాలని డిమాండ్ చేస్తు ఆ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. మండలంలోని చింతాలక్ష్మీనగర్ గ్రామంలో శుక్రవారం ఎన్డీ నాయకులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డీఎల్‌సీ నాయకురాలు సున్నం భూలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజాపాలన చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాశవిక నిర్బంధాలకు పాల్పడుతోందన్నారు. కార్యక్రమంలో కృపారాణి, లక్ష్మి, బతుకమ్మ, సుజాత, అచ్చమ్మ, కమలక్క, వెంకటమ్మ, లక్ష్మీ నారాయణ, పాషా తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: అక్రమంగా అరెస్టు చేసిన న్యూడెమోక్రసీ నాయకులను వెంటనే కోర్టులో హాజరు పరచాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మల్లెలమడుగులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 14న బయ్యారం ప్రాంతంలో న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్, రాష్ట్ర నాయకులు గోపన్న, పుల్లన్న, మదార్‌లను పోలీసులు అక్రమ అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అరెస్టు చేసిన నాయకులకు ఎలాంటి హానీ తలపెట్టకుండా వెంటనే అందరినీ కోర్టులో హాజరు పరచాలని ఆమె డిమాండ్ చేశారు. నాయకులు జక్కం కొండలు, అరుణ, రమేష్, లక్ష్మి, భీమా, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

అశ్వాపురం: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో అభివృద్ధి, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయమని డీసీసీబీ డైరెక్టర్ తుక్లూరి బ్రహ్మయ్య అన్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంజూరు చేసిన స్పెషల్ గ్రాంటు నిధులతో మండల పరిధిలోని అశ్వాపురం, కొమ్ముగూడెం, అమ్మగారిపల్లి, సీతరాంపురం గ్రామ పంచాయతీల్లో ఎనిమిది సీసీ రోడ్ల నిర్మాణాలకు శుక్రవారం తుక్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, ఏఈ చక్రధరాచారి, జిల్లా, మండల కోఆప్షన్ సభ్యులు షర్ఫియుద్దిన్, ఎస్‌కే ఖదీర్, ఎంపీటీసీ తుక్లూరి గంగాభవాని, గాదె వెంకటరెడ్డి, బెల్లి బాబురావు, ముత్తినేని వాసు, వేములపల్లి రమేష్, పాడియం అనిల్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, మురళీకృష్ణ, రాయల భాస్కర్‌రావు, నాగయ్య, నర్సింహారావు, రాంబాబు, వరప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.


అశ్వాపురంలో సీసీ రోడ్ల శంకుస్థాపనలో తుక్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ సుజాత

# ప్రగళ్లపల్లి లిఫ్ట్ కల నెరవేరేనా..?

- పూర్తయితే 2వేల ఎకరాలకు సాగునీరు
- సర్వేలతో వదిలేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతుల ఆశలు


ప్రగళ్లపల్లి లిఫ్ట్ ఇదే..

దుమ్ముగూడెం: తలాపున గోదావరి నదీ ప్రవహిస్తున్నా సాగునీటి కోసం మండల వాసులు కష్టాలు పడుతున్నారు. మండల వరప్రదాయనీగా పిలువబడే ప్రగళ్లపల్లి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆగమేఘాల మీద రిటైర్డు ఇంజనీర్‌తో సర్వే చేయించి ఎస్టీమేట్ సైతం వేయించిన సంగతి తెలిసిందే. ఎస్టీమేషన్‌లో సుమారు రూ.645 కోట్ల వరకు నిధులు అవసరం అవుతాయని లెక్కలు రావడంతో ఇక అక్కడి నుంచి ప్రభుత్వం గప్‌చూప్ అయింది. రైతులు ఎంతో ఆశగా ఎదురుచూసే ప్రగళ్ళపల్లి లిఫ్ట్ కలగానే మారుతుందా లేదా కాంగ్రెస్ ప్రభుత్వం అయినా పూర్తి చేస్తుందా అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు.

మండలంలో సాగుకు తిరుగులేకుండా చేసేందుకు మండలంలోని ప్రగల్లపల్లి వద్ద గోదావరి నదిపై ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టాలని మండల ప్రజలు ఏళ్ల తరబడి ప్రభుత్వాలను వేడుకుంటున్నారు. ఈ ఎత్తిపోత పథకంతో సరిహద్దులోని సుమారు 20 గ్రామాలకు సాగునీరు అందించడతో 2 వేల ఏకరాల బీడు భూమి సస్యశామలం అవుతాయి. ప్రస్తుతం కాలువల ద్వారా సుమారు వెయ్యి ఏకరాలకు సాగు నీరం అందిస్తున్న ప్రగళ్లపల్లి ఎత్తిపోతల పథకాన్ని అధునీకరించి పైప్‌లైన్ల ద్వారా సరిహద్దు గ్రామాల్లో భూములకు సాగు నీరు అందించాలనేది ఇక్కడి రైతుల డిమాండ్ చేస్తున్నారు.

**నాటి ప్రభుత్వంలో కదలిక**

ఈ పథకం కోసం సీపీఎం దివంగత నేత మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య ప్రతీ సారి జరిగే శాసన సభ సమావేశాల్లో ప్రస్తవించారు. ప్రభుత్వం ఈ పథకం ఏర్పాటుకు చర్యలు తీసుకోని గిరిజన బీడు భూములకు సాగు నీరు అందించాలని తమ బాధను కోయ భాషలో సైతం వ్యక్త పరిచారు. దీంతో అప్పటి ఉమ్మడి జిల్లాల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ పథకంపై పూర్తి నివేదిక అందించాలని అధికారులను కోరడంతో కొద్దిపాటి కదలిక మొదలైంది. ఇరిగేషన్ అధికారులు ఓ రిటైర్డ్ అధికారితో ప్రగళ్లపల్లి పాత ఎత్తిపోతల పథకం వద్ద నూతన ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసేందుకు అనుకూల, ప్రతికూల పరిస్థితులపై సర్వే చేయించారు. నాలుగు రోజుల పాటు మండలంలో పర్యటించిన ఆయన ఎత్తిపోతల పథకం ఏర్పాటు సంబంధించిన పూర్తి నివేధికను ఇరిగేషన్ ఉన్నతాధికారులకు అందజేశారు. నాటి అధికార పార్టీ నాయకులు సైతం ప్రజలకు సానుకూల సాంకేతాలిచ్చారు. కానీ చివరికి ఏమైందో ఏమో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగ ఎత్తిపోతల పథకం ఉత్తిపోతలైంది. దీంతో మండలంలో సరిహద్దు గ్రామాల్లోని రైతుల ఆశలు అడియాశలయ్యాయి. దుమ్ముగూడెం ఆనకట్ట దగ్గర సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించడంతో ప్రగళ్లపల్లి లిఫ్ట్ పూర్తిగా మునిగే పరిస్థితులు ఆన్నాయి. దీంతో ప్రగళ్లపల్లి లిఫ్ట్ ఊసే లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో సున్నంబట్టి దగ్గర ఇదే ప్రాజెక్టు నిర్మిస్తే సీతమ్మసాగర్ వల్ల జరిగే నష్టం నుంచి బయటపడొచ్చు.

**లబ్ధిపొందే గ్రామాలు ఇవే..**

చినబండిరేవు వద్ద ఉన్న ప్రగళ్ళపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని సున్నంబట్టి వద్ద ఏర్పాటు చేసేలా జరిగిన సర్వేలో కమలాపురం, పెదకమాలాపురం, కొత్తపల్లి, అంజుపాక, మహాదేవపురం, దబ్బనూతల, కొత్తూరు, ఆర్లగూడెం, లచ్చిగూడెం, భీమ వరం, మారాయిగూడెం, సింగవరంల మీదుగా జిన్నెలగూడెం, పత్తిపాక వరకు సాగునీటిని ఎత్తిపోసేలా సర్వే జరిపి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఉన్న ప్రగళ్లపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ఆనాడు 12 వేల ఎకరాలకు సాగునీరు అందించేదిగా ఉండగా లిఫ్ట్ సక్రమంగా పనిచేయక 300ఎకరాల వరకు మాత్రమే ప్రస్తుతం సాగునీరు అందుతోంది. లిఫ్ట్ నిర్మాణం పూర్తయితే ఆదివాసీ రైతుల బీడు భూములు సస్యశామలం అవుతాయి.

**మంత్రి తుమ్మల దృష్టి సారించేనా..?**

బీఆర్ఎస్ హయాంతో మంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టుపై మొదట చొరవ చూపింది తుమ్మల నాగేశ్వరరావే. ఇప్పుడు ఆయన మరోమారు మంత్రిగా ఉన్నారు. ప్రాజెక్టులు ఆయన శాఖ పరిధిలో లేనప్పటికీ ఏజెన్సీ అభివృద్ధి ప్రధాతగా పేరు గాంచిన తుమ్మల నాగేశ్వరావు ప్రగళ్లపల్లి లిఫ్ట్ కళ తీరేలా చొరవ తీసుకుంటారని ఆదివాసీ రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సైతం దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**లిఫ్ట్ పనులు చేపట్టాలి..**



ప్రగళ్ళపల్లి లిఫ్ట్ నిర్మాణం పూర్తి చేస్తే ఏజెన్సీలోని మారుమూల గ్రామాల రైతులకు సాగునీటి వేతలు తప్పించవచ్చు. ప్రగళ్ళపల్లి లిఫ్ట్ నిర్మాణం కోసం సీపీఎం ఆధ్వర్యంలో గతంలో ఎన్నో పోరాటాలు నిర్వహించాం. సీపీఎం దివంగత నేత సున్నం రాజయ్య అసెంబ్లీ సాక్షిగా ప్రగళ్లపల్లి లిఫ్ట్ అవసరాన్ని తెలియపరిచారు. ఈ ప్రభుత్వం అయినా లిఫ్ట్ నిర్మాణం చేపడితే రైతులకు ఎంతో లాభదాయకం.

– కారం పుల్లయ్య, సీపీఎం మండల కార్యదర్శి